క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల వితరణ



తెనాలి: పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో గల శ్రీశ్రీనివాస నిత్యాన్నదాన ట్రస్టుకు పూండ్ల గ్రామస్తులు రూ.50,058 విరాళంగా సమర్పించారు. పూండ్లకు చెందిన స్వర్గీయ లోకం పుణ్యవతి సోదరుడు అంకత సూర్యప్రకాశరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి కాళికాంబ, కుటుంబ సభ్యులు విరాళం చెక్కును బుధవారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడుకు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

తెనాలిరూరల్: ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. తెనాలి పట్టణ నాజరుపేటలో రెండు ఇసుక ట్రాక్టర్లను రోడ్డు వెంబడి నిలిపి ఉండడాన్ని వన్‌టౌన్ పోలీసులు బుధవారం గుర్తించారు. పత్రాల కోసం డ్రైవర్లను ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్నుంచి ఇసుకను తరలించినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

జామ మొక్కలు పంపిణీ



తెనాలిఅర్బన్: డాక్టర్ శారద సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ శారద ఆధ్వర్యంలో బుధవారం చినరావూరు రైల్వే స్టేషన్ రోడ్డులో ఇంటింటికి జామ మొక్కల పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో వాటిని నాటాలని ఆమె సూచించారు. ప్రతి రోజు 2500 మొక్కలను పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, వైస్ ప్రిన్సిపల్ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

హాస్పటల్స్‌కు వెళ్లి పింఛన్లు పంపిణీ



మణిపాల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న సత్యనారాయణకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మి

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం తెనాలిలో బుధవారం కొనసాగింది. పట్టణంలోని అన్ని వార్డులతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి వాటిని పంపిణీ చేశారు. పినపాడు-1 సచివాలయ పరిధిలోని పమిడి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ తాడేపల్లిలోని మణిపాల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ లక్ష్మి అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను పంపిణీ చేశారు. అలాగే ఉడా కాలనీకి చెందిన షేక్ ఖాసీం వలి అనారోగ్యంతో బాధపడుతూ తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ త్రివేణి అక్కడికి వెళ్లి డీఎంహెచ్‌ఓ పింఛన్‌ను పంపిణీ చేశారు. అలాగే తెనాలి మండలం పెదరావూరుకు చెందిన ఎర్రసాని కనికరమ్మ గుంటూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వాలంటీర్ అద్దంకి రేవతి అక్కడికి వెళ్లి ఒంటరి మహిళ పింఛన్‌ను పంపిణీ చేశారు



తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఖాసీం వలికి డీఎంహెచ్‌ఓ పింఛన్‌ను పంపిణీ చేస్తున్న వలంటీర్ త్రివేణి

6న ఉచిత వైద్య శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 6న స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంకు చెందిన సాయికృష్ణ కళా వేదిక ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు వైద్యులు పాల్గొని పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఇక ఇంటివద్దకే సంపూర్ణ పోషణ కిట్

- గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ పంపిణీ
- గతంలోలా అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేదు
- ఆరోగ్యకర సమాజమే ముఖ్యమంత్రి ఆశయం
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: తల్లీబిడ్డలను పోషకాహారంతో సంరక్షిస్తే ఆరోగ్యకర సమాజం ఆవిర్భవిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావనగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఇందు కోసం గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణను ఇకపై ఇంటివద్దనే అందజేసేలా టేక్ హోం రేషను కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. గతంలోలా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే అవసరం లేకుండా గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దనే ప్రతి 15 రోజులకోసారి పది రకాల నాణ్యమైన సరుకులను అంగన్‌వాడీ కార్యకర్తలు అందజేస్తారని చెప్పారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు, తెనాలి పరిధిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషనును బుధవారం స్థానిక ఎన్జీఓ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. సభకు ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి సీడీపీఓ ఎం.సునీత అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాల అమలు ఎలా ఉండేది? వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా తీసుకొచ్చిన మార్పులు ఎలా ఉన్నాయనేది ప్రతిఒక్కరూ ఆలోచించాలని చెప్పారు.

లబ్ధిదారులకు నేరుగా...

అప్పట్లో సరుకుల కోసం గర్భిణులు, బాలింతలు గంటల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వేచివుండేవారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందించేలా సులభతరం చేశారని చెప్పారు. గతంలో అవ్వాతాతలకు నెలనెలా ఎక్కడెక్కడో ఇచ్చే పింఛనును ఇప్పుడు ఒకటో తేదీనే వారి ఇంటివద్దనే ఇస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు 10 రకాల నాణ్యమైన సరుకులను నేరుగా ఇంటికే అందజేసేలా మరో కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. తల్లి గర్భం దాల్చిన దగ్గర్నుండి అటు తల్లి, బిడ్డల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం బాధ్యత తీసుకుందన్నారు. ఎదిగిన బిడ్డల చదువు, మధ్యాహ్న భోజనం, విద్యాకానుక కిట్, తల్లికి అమ్మ ఒడికింద సాయం అందించడం సహా డిగ్రీ, ఇంజినీరింగ్ వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందజేస్తోందని తెలియజేశారు. తల్లులకు 45 ఏళ్లు వచ్చాక చేయూత, 60 ఏళ్లనుంచి పింఛను పంపిణీతో అండగా నిలుస్తున్నట్టు తెలియజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న నాణ్యమైన సంపూర్ణ పోషణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇంటికే పంపిస్తున్న నాణ్యమైన సరుకులను గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు తన ప్రసంగంలో రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే శివకుమార్‌ను ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలరు తాడిబోయిన రామయ్య, పార్టీ నేతలు కఠారి హరీష్, కొలకలూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత టేక్ హోం రేషను కిట్‌లోని సరుకులను ఎమ్మెల్యే శివకుమార్ పరిశీలించి, అనంతరం గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు.



సంపూర్ణ పోషణ కిట్‌లోని సరుకుల



బాలింతలకు పోషణ ఆహార కిట్లు అందజేస్తున్న సర్పంచ్ రాధిక, తహసీల్దారు నాంచారయ్య

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కొల్లిపర: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మిసుధ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన ర్యాలీ, పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి కాన్పు వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందుతుందన్నారు. బిడ్డకు మొదటి టీకా అని దేవుడిచ్చిన వరంలాగా తల్లులు భావించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు , మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కొల్లిపర: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుకోవడం వల్ల వారికి జన్మించే పిల్లలు కూడా ఆరోగ్యవంతులుగా జన్మిస్తారని తహసీల్దారు జి.నాంచారయ్య , ఎంపీడీఓ చంద్రమోహన్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక నుంచి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెల గర్భిణికి, బాలింతలకు పోషకహారం కలిగిన కిట్లు ఇంటింటికి సరుకులు ఇస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఈ ఆహారం తీసుకుంటే జీవితంలో అనిమియా వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. సర్పంచ్ పిల్లి రాధిక మాట్లాడుతూ గర్భిణి సమయంలో ప్రతి మహిళ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండటమే కాకుండా బిడ్డకు మేలైన పాలు ఇవ్వడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషక ఆహార కిట్లులను బాలింతలు, గర్భిణులు ఉపయోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.శ్రీలత, మాజీఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి, సూపర్‌వైజర్ వై.నాగమణి, జి.వెంకటరమణ, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



తెనాలిటౌన్: మహిళలు రక్తహీనత బారిన పడకుండా చూసుకోవాలి. రోజువారి ఆహారంలో పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సి.హెచ్.వి.సుబ్బారావు తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను డాక్టర్ సుబ్బారావు అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ చిరు ధాన్యాల నుంచి వచ్చే ప్రోటీన్లు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. తల్లి, శిశువుకు మంచి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ కిట్లను అందజేస్తోందన్నారు. దీన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ త్రివేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్, కె.రాజయ్య, ఏఎన్ఎంలు గజలక్ష్మి, జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, సరోజిని, దుర్గాదేవి, హేమలత, సరళ, అనితారాణి, త్రిపుర, హైమావతి, రాహేలు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పందెం కోళ్ల అపహరణ

తెనాలిరూరల్: పందెం కోళ్ల అపహరణకు గురైయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల మేరకు జగ్గడిగుంటపలెం శివారులో సుభాని పందెం కోళ్లను పెంచుతున్నాడు. కోళ్లు ఉన్న గది పైకప్పు రేకులను సోమవారం రాత్రి తొలగించిన దుండగులు లోనికి వెళ్లి ఎనిమిది కోళ్లను అపహరించుకెళ్లారు. దీనిపై పెంపకందారుడు పోలీసులకు సమాచారమిచ్చాడు మినహా లిఖిత పూర్వక ఫిర్యాదు చేయలేదని తెలిసింది. అపహరణకు గురైన కోళ్ల విలువ సుమారు రూ. 1.60 లక్షలు ఉంటుందని తెలిపాడు.

జగనన్నతోనే పేదల అభ్యున్నతి

ఎమ్మెల్యే శివకుమార్



లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తోనే పేదల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం కొల్లిపర గ్రామంలో సచివాలయం 3 పరిధిలోని బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి ఇంటి వద్ద నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని 290 ఇళ్లను సందర్శించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లిన సమయంలో ఆకుటుంబం ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే వివరించి సంక్షేమ కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం గ్రామంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి ఇంట్లో ఉన్న వారికి చెబుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరల అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఈ క్రమంలో ఓ ఇంటి వద్దకు వెళ్లిన ఎమ్మెల్యేను 102 సంవత్సరాల వయో వృద్ధురాలు ఆరిమండ అన్నపూర్ణమ్మ ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యే ముఖాన్ని నిమురుతూ ఎలా ఉన్నావు నాయనా... ఎన్నాళ్లైంది నిన్ను చూసి...నా ఇంటికి రావడం ఆనందంగా ఉంది, నా మనవడు లాగా భావిస్తున్న సీఎం జగన్ ఎలా ఉన్నాడు అంటూ ముచ్చటించారు. ఎమ్మెల్యే వృద్ధురాలతో మాట్లాడుతూ మీలాంటి పెద్దవారు ఆశీస్సులు ఉన్నంత వరకు బాగుంటామని తెలిపారు. పింఛన్ సక్రమంగా వస్తుందా అని అడగ్గా , ప్రతి నెలా 1వ లేదా 2వ తేదీన ఇంటికే వలంటీర్ ఉదయం 6గంటలకు తెచ్చి ఇస్తున్నారని సంతోషంగా బదులిచ్చింది. తన లాంటి వృద్ధులకు ఇలాంటి సేవలు చేస్తున్నందుకు రానున్న ఎన్నికల్లో తన ఓటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సచివాలయం 3 పరిధిలో సుమారు 5081 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో సంక్షేమం పథకాలు ద్వారా లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లో రూ.12.77కోట్ల జమ చేసినట్లు తెలిపారు .డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి కోసం రూ.68 లక్షలు ఖర్చుచేసినట్లు తెలిపారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు గ్రామంలో ఇంకా అర్హత ఉండి వివిధ సాంకేతిక లోపాలు వల్ల ఇంకా రానివారు తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యను వెంటనే పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక , ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి,పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి,ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఆరిమండ మహేంద్రారెడ్డి , గుడిబండి వెంకటరెడ్డి, గుడిబండి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ లు ఝాన్సీ ,కె.శ్రీలత, నాయకులు కళ్ళం వీరారెడ్డి, వంగా బూషిరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, జొన్నల శివారెడ్డి, గుడిబండి కృష్ణకిషోర్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రమోహన్, తహసీల్దారు జి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది ,వాలంటీరులు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం



భూమి భారతి కేంద్రం ఎదుట ప్రకృతి రైతులు, అధికారులతో నరసింహారెడ్డి



అయిదు అంచెల నమూనా తోటలో నరసింహారెడ్డి

అత్తోట(కొల్లిపర) : రాష్ట్రంలో అమలు జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానంపై అధ్యయనం చేస్తున్న సెంట్రల్ యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి బుధవారం ప్రకృతి వ్యవసాయంలో పేరెన్నికగన్న కొల్లిపర మండల గ్రామం అత్తోటను సందర్శించారు. జిల్లాలో మూడురోజుల పర్యటనలో భాగంగా వచ్చిన నరసింహారెడ్డి, అక్కడి దేశీ వరి విత్తన కేంద్రం ×భూమి భారతి×ని తిలకించారు. విత్తనకేంద్రంలో గల రైతులు ఉత్పత్తి చేసిన దేశవాళీ విత్తన రకాలను పరిశీలించి, ఆ వివరాలను తెలుసుకున్నారు. ప్రకృతి రైతులతో సమావేశమై ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) దుకాణాన్ని సందర్శించారు. గ్రామంలోని ప్రకృతి రైతు నామని రోశయ్య భూమిలో అనుసరిస్తున్న అయిదు అంచెల నమూనాను ప్రత్యేకంగా చూశారు. గ్రామ సంఘం సమావేశంలో మహిళా రైతుల ప్రకృతి వ్యవసాయ అనుభవాలు, ఆలోచనలపై చర్చించారు. గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె.రాజకుమారి, ఏడీపీఎం జానకమ్మ, సీఆర్‌పీ తాతాజీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి



అమీరుద్దీన్, రజాక్‌లను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తెనాలిరూరల్: రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు రిటైర్డ్ రైల్వే మెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. అసోసియేషన్ సమావేశాన్ని బుధవారం తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలోని కార్యాలయంలో నిర్వహించారు. విజయవాడ డివిజనల్ కార్యదర్శి బి. వెంకటసుబ్బారావు, అధ్యక్షుడు హరిరావు, కోశాధికారి, గుంటూరు డివిజనల్ కార్యదర్శి నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు తదితర నాయకులు పాల్గొన్నారు. అసోసియేషన్ తెనాలి బ్రాంచి అధ్యక్షుడు అమీరుద్దీన్‌కు 80 ఏళ్ల, వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్‌కు 85 ఏళ్లు నిండిన నేపథ్యంలో వారిని సభ్యులు ఘనంగా సత్కరించారు. పెన్షనర్ల సమస్యల గురించి చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమాన్ని తెనాలి బ్రాంచి కార్యదర్శిఎం. నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు.


మణిపూర్ దారుణాలపై శాంతి ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌లు, జేఎంజే కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు



ఓవర్‌బ్రిడ్జిపై మహాశాంతి ర్యాలీ



గాంధీచౌక్‌లో ఎమ్మెల్యే శివకుమార్ సంఘీభావం

తెనాలి: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులు, అత్యాచారాలకు నిరసనగా తెనాలి పట్టణ పాస్టర్స్ ఐక్య అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహాశాంతి ర్యాలీని భారీగా నిర్వహించారు. మణిపూర్‌లో ప్రజ్వరిల్లిన హింస 79 రోజులపాటు కొనసాగినా, అక్కడి ప్రభుత్వం నియంత్రించపోవడం, చర్చిలను ధ్వంసం చేయడం, క్రైస్తవ మతానికి చెందిన కుకీ తెగ ప్రజలపైనా సామూహిక దాడులు, మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం నుంచి ర్యాలీ ఆరంభమైంది. మణిపూర్ ఘటనలపై నిరసనను తెలియజేస్తూ, అక్కడ శాంతిని నెలకొల్పాలన్న డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ధరించి పెద్దసంఖ్యలో దైవసేవకులు, పట్టణ సంఘ కాపరులు, వివిధ సంఘాలకు చెందిన ప్రజలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ర్యాలీలో పాల్గొన్నారు. మణిపూర్‌ను రక్షించండి...అక్కడ శాంతిని నెలకొల్పాలంటూ నినాదాలు చేశారు. చెంచుపేట ఓవర్‌బ్రిడ్జి మీదుగా పట్టణ ప్రధాన రహదారుల్లో సాగిన ర్యాలీ సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేశారు. మార్గమధ్యంలో గాంధీచౌక్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. మణిపూర్ సహా దేశంలో సంఘ విద్రోహ శక్తుల కారణంగా నష్టపోయిన బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతి నెలకొనాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తూ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శాంతిర్యాలీ కమిటీ నేతలు ప్రసంగిస్తూ మణిపూర్‌లో జరిగిన దుశ్చర్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే అక్కడ శాంతిని నెలకొల్పాలని, దారుణాలకు పాల్పడిన నిందితులకు కఠినశిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. తెనాలి సంఘ కాపరుల అధ్యక్షుడు బిషప్ పి.జాన్‌పాల్, బిషప్ కె.సుధీర్‌కుమార్, ప్రపంచ మానవహక్కుల పరిరక్షణ అంతర్జాతీయ సభ్యుడు డాక్టర్ ప్రభుదాస్, మదీర నేషనల్ హ్యూమన్ రైట్స్ ఏసీబీ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ప్రేమ్‌కుమార్, బిషప్ పరమజ్యోతి, రెవరెండ్ ఇమ్మానుయేలు దాసు, ఎ.భానుప్రసాద్, సర్వోన్నతరావు, సీహెచ్‌వీ ప్రసాద్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి, బ్రదర్ ఆనందన్న, టి.డేవిడ్, పి.ఇస్సాకు, ఎం.చిట్టిబాబు, కె.అబ్రహాం, ముస్లిం నేతలు హాఫీజ్ అహ్మద్, ఎండీ రియాజ్, షబ్బీర్, హాఫీజ్, జుబెర్, సయ్యద్ సర్దార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శివకుమార్ సంఘీభావం...


తెనాలి పట్టణ పాస్టర్స్ ఐక్య అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మహాశాంతి ర్యాలీకి స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సంఘీభావం తెలియజేశారు. ర్యాలీలో కొంతదూరం పాల్గొన్నారు. గాంధీచౌక్ వద్ద ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన దారుణాలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రజలందరికీ వర్తిస్తాయని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల హక్కులను కాపాడుతుందని స్పష్టం చేశారు.

తెనాలిలో శాంతి ర్యాలీ

తెనాలిఅర్బన్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరశిస్తు తెనాలిలోని ఆర్‌సీఎం చర్చి, జేఎంజే కళాశాల, జేఎంజే గ్లోబల్ స్కూల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఫాదర్ స్లీవ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేయడం దారుణమన్నారు. అలాంటి వాటికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మణిపూర్‌లో శాంతి నెలకొనే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్ విజయ్, చర్చి సభ్యులు, జేఎంజే విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

మండల ప్రత్యేక అధికారి కృష్ణారావు



కొల్లిపర: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా తగు చర్యలు చేపట్టాలని, వందకు వంద శాతం ఇళ్లు నిర్మాణ పనులు పూర్తి కావాలని మండల ప్రత్యేక అధికారి ఆర్‌జి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, అసిస్టెంట్ ఇంజినీర్లులకు, హౌసింగ్ అధికారులకు జగనన్న కాలనీలల్లోని ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జగనన్న కాలనీల్లో ఎంత మేరకు లబ్ధిదారులు గృహాలు నిర్మించుకొన్నారు, ఇంకా ఎంత మంది నిర్మించుకోవాలని, ఎంత మంది ఏఏదశలో నిర్మాణ పనులల్లో ఉన్నారు అన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇసుక. సిమెంట్, స్టీల్ తదితర సామాగ్రి అందిస్తోందని పూర్తి స్థాయిలో వివరించి ప్రతి లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునే విధంగా కృషి చేయాలన్నారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. హౌసింగ్ డీఈ రఫీవుల్లఖాన్ హౌసింగ్ ఏఈ సుబ్బారావు, తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీఓ చంద్రమోహన్ , పంచాయతీ కార్యదర్శులు, అసిస్టెంట్ ఇంజినీర్లులు పాల్గొన్నారు.